సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 12 । నవంబర్ । 2024



కురుమూర్తివాస గోవిందా..
కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.
వివరాలు 8లో ▸



దశవిధ హారతులు
జోగులాంబ ఆలయం వద్ద తుంగభద్ర నదీ మతల్లికి దశవిధ హారతులు ఇచ్చారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
37.0 /17.8
ఉదయం చలి ఉంటుంది. కొద్దిమేర ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య కార్యక్రమాలు వందశాతం అమలు



ఇటిక్యాల: ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలను వందశాతం అమలుపర్చాలని డీఎంహెచ్‌ఓ డా.సిద్దప్ప అన్నారు. సోమవారం ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గర్భిణులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు 102 వాహనం అన్ని గ్రామాలకు వెళ్లేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. టీబీ, లెప్రసి కేసులను గుర్తించి, వారికి అవసరమైన చికిత్స అందించాలని తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటిస్తూ.. రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ వెంట మాతాశిశు సంరక్షణ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.ప్రసూనారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రిజ్వానా తస్నీమ్, డీడీఎం రామాంజనేయులు, డాక్టర్ మానస తదితరులు ఉన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి



గట్టు: తపాలాశాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా పర్యవేక్షకురాలు జ్యోతి కోరారు. సోమవారం మాచర్ల సబ్ పోస్టాఫీస్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎస్‌బీ, సుకన్య, ఎంఐఎస్‌టీడీ, మహిళా సమ్మాన్ సర్టిఫికెట్లు కలిగిన వారు పోస్టాఫీసులో తప్పనిసరిగా పరిశీలన చేసుకోవాలని సూచించారు. పోస్టాఫీసుల్లో అన్ని రకాల పొదుపు ఖాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్‌శాఖ సహాయకుడు సైదానాయక్, మహబూబ్‌నగర్ పోస్టల్ అధికారి వంశీ, ఎస్‌బీఎం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

పీజీ కళాశాల భవనాన్ని అందుబాటులోకి తేవాలి



గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పీజీ కళాశాల నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, ఈ విద్యా సంవత్సరం తరగతులను ప్రారంభించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య కోరారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజీ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల బీఆర్‌ఎస్‌వీ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజ్, రమేష్, ఆఫ్రిది, నరేష్, కోటేష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు విషయంలో హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 18లోగా చెల్లించేందుకు గడువు ఉందన్నారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబర్ 2 వరకు, రూ.200 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 21 వరకు చెల్లించుకోవచ్చన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు 10వ విద్యార్థులకు ఆయా తేదీలను తెలియపరిచి, అపరాధ రుసుం లేకుండా ఈ నెల 18లోగా పరీక్షల ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలని, వెంటనే పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి.. జిల్లా పరీక్షల విభాగానికి అందజేయాలని సూచించారు.

రుణమాఫీ కాలే.. కొత్త లోన్ ఇవ్వలే..



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన కె.వెంకటయ్య. ఈయనకు 1.5 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. మూడేళ్ల క్రితం పోల్కంపల్లి సింగిల్ విండోలో రూ.45 వేల పంట రుణం తీసుకున్నాడు. ఎన్నికలకు ముందు వడ్డీ కట్టమని సింగిల్ విండో అధికారులు ఒత్తిడి తెచ్చారు. డబ్బులు లేక కట్టలేకపోయాడు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేయగా వెంకటయ్యకు కాలేదు. పాత బకాయి మాఫీ కాకుండా అలాగే ఉండిపోవడంతో కొత్తగా పంట రుణం ఇవ్వలేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పు చేసి.. పంట సాగు చేస్తున్నానని ఆ రైతు వాపోతున్నాడు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..




వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన రైతు రాజేశ్వర్‌రెడ్డికి రెండెకరాల 29 గుంటల పొలం ఉండగా.. బ్యాంకులో రూ.1.60 లక్షల పంట రుణం పొందారు. వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో సంతోషపడ్డాడు. కానీ ఇప్పటివరకు అతడి రుణం మాఫీ కాకపోవడంతో నిత్యం వ్యవసాయశాఖ కార్యాలయం, బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నారు. తనకు రుణమాఫీ పథకం వర్తింపజేయాలని కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు.

రుణమో రామచంద్రా..!

పంట రుణాలకు బ్యాంక్ అధికారుల కొర్రీలు

- రుణమాఫీ వర్తించినా.. అందని కొత్త రుణాలు
- సాంకేతిక సమస్యలతో వేలాది మంది దూరం
- మాఫీకి నోచుకోని వారు సైతం వెంపర్లాట
- పాతవి చెల్లిస్తేనే కొత్త వాటికి అర్హులని బ్యాంకర్ల మెలిక
- ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లుగా లక్ష్యాన్ని చేరుకోని బ్యాంక్‌లు
- విధిలేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- నెలనెలా వడ్డీల భారం మోయలేక సతమతం



సాక్షి ఫోకస్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రుణమాఫీ చిక్కులు.. బ్యాంకర్ల కొర్రీలు వెరసి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో రైతులకు పంట రుణాలు అందడం లేదు. రుణమాఫీ అయినా సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారడంతో వేలాది మంది కొత్త రుణాలకు దూరమయ్యారు. మరోవైపు అర్హులై ఉండి రుణమాఫీకి నోచుకోని వారు సైతం క్రాప్ లోన్ కోసం వెంపర్లాడక తప్పడం లేదు. పాతవి పూర్తిగా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని బ్యాంక్ అధికారులు పెడుతున్న మెలికతో అన్నదాతలు విధి లేని పరిస్థితుల్లో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

కొత్తగా 'సాంకేతిక' ఇబ్బందులు..

రుణమాఫీ వర్తించినా.. వివిధ సాంకేతిక కారణాలతో బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమకాని వారు ఉమ్మడి జిల్లాలో సుమారు 30వేల మంది ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఆధార్, లోన్ అకౌంట్లకు పేరు సరిపోలకపోవడం, ఆధార్ నంబర్ కరెక్ట్ లేకపోవడం, ఫ్యామిలీ గ్రూప్‌లో వేరే వారి పేరు చేరడం, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌లో పేరు సరిపోలకపోవడం, రేషన్ కార్డు లేకపోవడం వంటి కారణాలతో వారి వారి ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. ఈ క్రమంలో వారికి కొత్తగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు వెనుకంజ వేస్తున్నారు. ఈ క్రమంలో సదరు రైతులు ఇటు రుణమాఫీ అమలు కోసం.. అటు పంట రుణాల కోసం బ్యాంకర్ల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు.

లక్ష్యం.. బహుదూరం

ప్రతి ఆర్థిక సంవత్సరం బ్యాంకర్లు ప్రకటిస్తున్న రుణ ప్రణాళికలు రికార్డుల ప్రకారం ఘనంగా ఉన్నప్పటికీ.. అమలులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2020 నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు ఆర్థిక సంవత్సరాల వారీగా ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో వందశాతం రుణ లక్ష్యాన్ని చేరుకున్న దాఖలాలు లేవు. గరిష్టంగా 60 శాతానికి మించి రుణ లక్ష్యం చేరుకోలేదు. ప్రతి ఏటా లక్ష్యం బహుదూరంగానే ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో పంట రుణాల వివరాలు (రూ.కోట్లలో)..

సంవత్సరం	లక్ష్యం	చేరుకున్నది
2020-21	2,057.01	1,159.21
2021-22	2,751.82	1,491.35
2022-23	2,951.42	1,451.23
2023-24	3,162.45	1,584.82
2024-25	3,343.44	1,248.34 (ఇప్పటివరకు)
జోగులాంబ గద్వాల జిల్లాలో..		
2020-21	1,473.41	618.05
2021-22	2,067.17	991.50
2022-23	2,404.30	1,212.45
2023-24	2,647.79	1,317.70
2024-25	3,520.34	1,095.35 (ఇప్పటివరకు)
నారాయణపేట జిల్లాలో..		
2021-22	1,877.07	1,100.32
2022-23	2,184.36	1,476.30
2023-24	2,452.62	1,451.57
2024-25	2,768.34	1,099.59 (ఇప్పటివరకు)
నాగర్‌కర్నూల్ జిల్లాలో..		
2021-22	3,773.84	1,723.86
2022-23	4,348.01	2,709.87
2023-24	4,964.80	2,890.62
2024-25	5,447.04	1,470.70 (ఇప్పటివరకు)
వనపర్తి జిల్లాలో..		
2020-21	2,205.12	1,159.21
2021-22	2,981.81	1,191.54
2022-23	3,217.76	1,257.98
2023-24	3,821.77	1,143.84
2024-25	4,910.68	1,369.66 (ఇప్పటివరకు)

రైతు భరోసా లేక.. రుణాలు రాక

గత ప్రభుత్వంలో రైతుబంధు కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున ఏడాదికి రెండు పర్యాయాలు మొత్తం రూ.12 వేలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమయ్యాయి. ఈ మేరకు అన్నదాతలకు పెట్టుబడి అవసరాలు కొంత మేర తీరేవి. కాంగ్రెస్ సైతం రైతు భరోసా కింద ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు అయినా.. ఇప్పటివరకు రైతు భరోసా అమలుపై ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఈ క్రమంలో బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలో వెనుకంజ వేస్తుండడంతో రైతులు పెట్టుబడి కోసం నానాతంటాలు పడాల్సి వస్తోంది.

రుణమాఫీ ఊసే లేదు..



కేటీదొడ్డిలో నాకు రెండెకరాలు భూమి ఉంది. నేను గట్టు ఎస్‌బీఐలో రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాను. కానీ ఇప్పటివరకు నా రుణం మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. వారు కూడా ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదు. నాకు రుణమాఫీ వస్తుందో లేదోనన్న అయోమయంలో ఉన్నా. ఇప్పటికైనా ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

– చిన్నకొండయ్య, రైతు, కేటీదొడ్డి మండలం

అప్పుడు, ఇప్పుడు అంటున్నారు..



నాకు జాంపల్లి శివారులో రెండెకరాల పొలం ఉంది. ఇంటి, పంట అవసరాల నిమిత్తం కో ఆపరేటివ్ బ్యాంకులో మార్టిగేజ్ చేసి రూ.4 లక్షల రుణం తీసుకున్నాను. రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే అప్పుడు, ఇప్పుడు అంటున్నారు. నా రుణం ఎప్పుడు మాఫీ అవుతుందో తెలియడం లేదు.

– ఆనందం, రైతు, ధరూరు

అప్పు చేసి కట్టాను..



మా గ్రామంలో ముగ్గురు, నలుగురికి మినహాయిస్తే అందరి రుణాలు మాఫీ అయ్యాయి. నాకు, నా భార్య పేరుపై రూ.2లక్షలకు పైబడి రుణం ఉందని మాఫీ కాలేదు. రూ.2 లక్షల లోపు రుణం ఉంటే మాఫీ అవుతుందని అందరూ చెబితే, నెలరోజుల క్రితం రూ.91 వేలు అప్పు తెచ్చి, బ్యాంకులో కట్టాను. ప్రస్తుతం ఎవరూ రుణమాఫీ మాటే ఎత్తడం లేదు. బ్యాంకులో అడిగితే రుణమాఫీ కాని వారు చాలామంది ఉన్నారు.. వారికి అయినప్పుడు మీకు అవుతుందని అంటున్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే, మిగిలిన డబ్బులు చెల్లించి కొత్త రుణం తీసుకునే వాళ్లం. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నాం.

– పుట్ట చిన్నయ్య, రైతు, కొత్తరాంనగర్, నాగర్‌కర్నూల్ జిల్లా

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



మల్దకల్: బాలలతో వ్యవసాయ పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి గంట కవిత అన్నారు. సోమవారం మల్దకల్ మండలం పాల్వాయి, పెద్దపల్లి శివారుల్లోని పత్తి పొలాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రైతులు 18 ఏళ్లలోపు చిన్నారులతో వ్యవసాయ పనులు, సీడ్‌పత్తి పనులు చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నందికర్, బాలరక్ష భవన్ సిబ్బంది ప్రకాష్, పద్మ, నళిని, మొహిన్‌పాషా, లలితమ్మ పాల్గొన్నారు.

నిలిచిన పత్తి కొనుగోలు



అలంపూర్: అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ కేంద్రంలో సోమవారం పత్తి కొనుగోలును తాత్కాలికంగా నిలిపివేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ కుమార్, కార్యదర్శి ఎల్లస్వామి తెలిపారు. కాటన్‌మిల్లు యాజమానులు బంద్‌కు పిలుపునివ్వడంతో సీసీఐ కేంద్రంలో కొనుగోలు జరగలేదని పేర్కొన్నారు. కాటన్ మిల్లుల యజమానులు చేపట్టిన ఆందోళనను విరమించుకుంటే సోమవారం పత్తి విక్రయించుకోవడానికి టోకెన్లు పొందిన రైతుల నుంచి మంగళవారం కొనుగోలు చేస్తామన్నారు. ఒకవేళ కాటన్ మిల్లుల యజమానులు బంద్ కొనసాగిస్తే.. మంగళ, బుధవారాల్లో సైతం ఎలాంటి కొనుగోలు జరగవన్నారు. ఆయా రోజుల్లో కొత్తగా టోకెన్లు జారీ చేయమని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో విద్యుత్ లైన్ల ఏర్పాటు, చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరాఫరాలో తాత్కాలికంగా అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఒకటో ఫీడర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, మోమిన్ మహెల్లా, రాయచూర్ రోడ్డు, తెలుగుపేట, తెరు మైదానం, వడ్లవీధి, శేరెల్లివీధి, దౌదర్‌పల్లి, అయిజ రోడ్డు, ఇండస్ట్రీ ఏరియాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార మార్గం చూపాలని సూచించారు. అధికారులపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. ప్రజావాణికి మొత్తం 38 అర్జీలు వచ్చాయని తెలిపారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 9 ఫిర్యాదులు..

గద్వాల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 9 ఫిర్యాదులు అందాయని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అందులో భూతగాదాలు, ఆస్తి వివాదం, చీటింగ్ తదితర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. భూతగాదాలను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు.

15న ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 15వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14, అండర్–17 విభాగాల బాలబాలికల బాక్సింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేవారు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం నర్సింలు 9849650366 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి



రాజోళి కేజీబీవీలో డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న నాబార్డు ఏజీఎం మనోహర్‌రెడ్డి

రాజోళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, మెరుగైన విద్య అందించేందుకు నాబార్డు నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఏజీఎం మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తుమ్మలపల్లె పాఠశాలల్లో నాబార్డు నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదులు, సోలార్ ప్లాంట్, డిజిటల్ సిస్టం, తాగునీటి ట్యాంకుల నిర్మాణం తదితర సౌకర్యాలను సోమవారం పరిశీలించారు. ఆయా పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఎంపిక చేసిన పాఠశాలలను ఆధునీకరించేందుకు అవసరమైన నిధులను నాబార్డు ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. నాబార్డు ఏజీఎం వెంట సెక్టోరియల్ ఆఫీసర్ శాంతరాజు, ఎంఈఓ భగీరథరెడ్డి తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం
- లింగాలలో 10వ జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం

వివరాలు 8లో ▸

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు ఫలితాలను ఫలితాలను www.telanganaopenschool.orgలో చూసుకోవాలని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య తెలిపారు. ఎస్సెస్సీ వారికి రీ కౌంటింగ్ రూ.350, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200 చెల్లించాలని, ఇంటర్మీడియట్ వారికి రీకౌంటింగ్‌కు రూ.400, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200 చెల్లించాలన్నారు. ఫీజులను ఈనెల 20 లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో ఓపెన్ ఫలితాలు ఇలా..

జిల్లా	ఎస్సెస్సీ		ఇంటర్	
	హాజరైన వారు	ఉత్తీర్ణులు	హాజరైన వారు	ఉత్తీర్ణులు
మహబూబ్‌నగర్	178	116	208	106
జోగులాంబ గద్వాల	247	173	256	150
వనపర్తి	51	44	141	104
నాగర్‌కర్నూల్	135	121	174	120
నారాయణపేట	191	168	357	219

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం 7వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం సాయంత్రం వరకు 4వేల క్యూసెక్కులకు తగ్గింది. నీటి కొరత కారణంగా జెన్‌కో జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315, ఆవిరి రూపంలో 96, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 730, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 1,000, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులతో కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 3,896 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.296 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 876.6 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 876.6 అడుగుల వద్ద 171.0635 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 1,824 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,081 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 19,216 మొత్తం 56,297 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 13,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,512, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సుంకేసులలో ఒక గేటు ద్వారా..

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 4,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక గేటును తెరిచి 1,824 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


యాదయ్య (ఫైల్)

అడ్డాకుల: మండలంలోని గౌరిదేవిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి చేపల వేటకు వెళ్లి చెక్‌డ్యాంలో పడి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చుక్క యాదయ్య (55) ఆదివారం సాయంత్రం చేపలు పట్టడానికి గ్రామ సమీపంలోని పెద్ద వాగులో ఉన్న చెక్ డ్యాం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. యాదయ్య ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసరాల్లో గాలించగా వాగు వద్ద దుస్తులు కన్పించడంతో అర్ధరాత్రి రెండు గంటల వరకు వాగులో వెతికారు. అయినా ఆచూకి లభించలేదు. సోమవారం ఉదయం గ్రామస్తులు చెక్‌డ్యాంలో గాలించగా యాదయ్య మృతదేహం లభ్యమైంది. యాదయ్య మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు..మండల పరిధిలోని ఆలేరు గ్రామానికి చెందిన బీరగళ్ల రాము అతని భార్య పుష్పలత ఆదివారం ద్విచక్ర వాహనంపై నాగర్‌కర్నూల్ వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా కమరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో పుష్పలత అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన రాము ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తెలిపారు. సోమవారం మృతిరాలి మరిది బీరగళ్ల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బైక్, స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి..

మల్దకల్ : స్కూల్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సోమవారం మండలంలోని పెద్దపల్లి–పాల్వాయి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని ట్రినిటి స్కూల్‌కు చెందిన బస్సు పాల్వాయికు వెళ్తుంది. వనపర్తి జిల్లా పెద్దమందడికి చెందిన వీరయ్య(31) పనుల నిమిత్తం బైక్‌పై పాల్వాయికు వస్తున్నాడు. ఎదురుగా వచ్చిన స్కూల్‌బస్సు వీరయ్యను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య పద్మమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరయ్య కుటుంబ సభ్యులకు స్కూల్ నిర్వాహకులు రూ.లక్ష నగదును చెల్లించినట్లు సమాచారం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు..

ఉండవెల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..
పుల్లూరు గ్రామానికి చెందిన మల్లెపోగు నాగరాజు(54) పత్తి మిల్లులో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పని చేసేందుకు పత్తి మిల్లుకు వెళ్లాడు. పని ముగించుకొని ఇంటి వస్తుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ సంఘటన హైవే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సోషల్ మీడియాలో సమాచారం అందించారు. సోమవారం కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో గుర్తించారు. పోలీసులకు సమాచారం వివరాలు తెలిపారు. కర్నూల్ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలకు తీసుకెళ్లారు. భార్య మల్లెపోగు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

అత్యాచారం కేసులో.. నిందితుడికి జైలుశిక్ష

నారాయణపేట: పోక్సో కేసులో ఓ వ్యక్తికి నేరం 21 ఏళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.21 వేల జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ తీర్పు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి డీఎస్పీ లింగయ్య వివరాల ప్రకారం.. మక్తల్ మండలం చిన్న గోప్లాపూర్‌కు చెందిన గుండ్ల అశోక్ ఇంటర్మీడియట్ విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఆ అమ్మాయి కడుపునొప్పి వస్తుందని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పగా ఆస్పత్రిలో చూపించడంతో ఏడు నెలల గర్భిణి అని తేలింది. దీంతో 30.11.2020న మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. అప్పటి మక్తల్ ఎస్‌ఐ రాములు కేసు నమోదు చేయగా, అప్పటి మక్తల్ సీఐ శంకర్ విచారణ చేసి కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. సోమవారం ప్రస్తుత సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఆదేశాల మేరకు కోర్టు లైజనింగ్ ఆఫీసర్, ఏఎస్‌ఐ కృష్ణయ్యగౌడ్, సీడీఓలు ఎండీ కబీర్, భీమ్‌రాజు సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు విజయ శ్రీధర్, ఆకుల బాలప్ప వాదనలు వినిపించారు. అనంతరం జిల్లా జడ్జి నిందితుడికి జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కేసులో విధులు బాధ్యతగా నిర్వర్తించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను డీఎస్పీ అభినందించి త్వరలో రివార్డు అందజేస్తామని చెప్పారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

10వ జోనల్‌స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


లింగాలలో జ్యోతి వెలిగించి జోనల్ క్రీడలను ప్రారంభిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: ప్రభుత్వం చదువులతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల క్రీడామైదానంలో నాలుగు రోజుల పాటు 10వ జోనల్ స్థాయి(బాలుర) క్రీడలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి వేదికలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి దోహదపడుతాయన్నారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే అవసరమని, క్రీడల వల్ల మేధాశక్తి పెరుగుతుందని, శారీక ధృఢత్వం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తరలివచ్చిన గురుకుల పాఠశాలు, కళాశాలల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు, ఆయా గురుకులాల నుంచి వచ్చిన ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

జోనల్ క్రీడల్లో గురుకుల పాఠశాలలు

10వ జోనల్ క్రీడల్లో అండర్–14, 17, 19 విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తుండగా 1,105 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని లింగాల, అచ్చంపేట, వీపనగండ్ల, పెద్దకొత్తపల్లి, మదనాపూర్, ఇటిక్యాల, జయప్రకాష్‌నగర్, ఐజ, జోగుళాంబ గద్వాల, దేవరకద్ర, దామరగిద్ద, బిజినేపల్లి, బాలానగర్ గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు.



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న బిజినేపల్లి క్రీడాకారులు


ప్రారంభ వాలీబాల్ పోటీలో తలపడుతున్న లింగాల, పెద్దకొత్తపల్లి జట్లు

పాలమూరు అభివృద్ధికి అడ్డుపడిందెవరు?


మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ జడ్చర్ల: పాలమూరు అభివృద్ధిని అడ్డుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదని, ఏ పార్టీ అడ్డుకుంటుందో స్పష్టం చేయాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో, జడ్చర్ల మండలం చిట్టిబోయిన్‌పల్లిలో ఆమె మీడియాతో మాట్లాడారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి కేంద్రంలోని తమ ప్రభుత్వం ఎప్పుడూ సహకరిస్తుందని చెప్పారు. ఎవరు సీఎంగా ఉన్నా.. వారి సొంత జిల్లాలను అభివృద్ధి చేసుకుంటారని, ఇదే కోవలో ఉమ్మడి జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరును అన్నిరంగాల్లో అభివృద్ధిపరిచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని, అభివృద్ధిలో తమను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అలాగే పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల బ్యాక్‌వాటర్ నుంచి చేపడితే మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీ హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా కేవలం 22 లక్షల మందికే పరిమితం చేశారన్నారు. సీఎం రేవంత్ అబద్ధాలు మాట్లాడడం స్థాయికి తగదని, ప్రభుత్వ తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. రైతులు పండించిన వరిధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఆలస్యం చేయవద్దని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.500 బోనస్‌తోపాటు కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. తేమశాతం లేదనే కారణంతో 15 రోజులుగా ధాన్యాన్ని ఆరబోసుకొని రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక బస్తాకు దాదాపు 1,300 గ్రాములు తరుగు తీసి కొంటున్నారని, మళ్లీ రకరకాల కారణాలతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు.

అధికారులపై దాడి సరికాదు

సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపై దాడి చేయడం సరికాదని డీకే అరుణ అన్నారు. తమకు కావాల్సింది పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని హితవు పలికారు. లగచర్ల వద్ద భూసేకరణ విషయంలో రైతుల సమస్య ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం బీజేపీ సీనియర్ నాయకుల బృందాన్ని లగచర్లకు పంపిస్తామని చెప్పారు. సమావేశంలో సీనియర్ నాయకులు చింతల రామచంద్రారెడ్డి, నాగూరావు నామాజీ, పాపయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, సతీశ్, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడలు ప్రారంభం


ఖోఖో ఆడుతున్న బాలికలు

- 10వ జోనల్‌స్థాయి క్రీడా జ్యోతిని వెలిగించిన ఎంపీ డీకే అరుణ
- రెండు జిల్లాల నుంచి 680 మంది బాలికలు హాజరు


ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న మక్తల్,ఊట్కూర్ క్రీడాకారులు

జడ్చర్ల: మండలంలోని చిట్టింబోయిన్‌పల్లి సమీపంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ ఆండ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీలను ఎంపీ డీకే అరుణ జెండా ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలోని ఎనిమిది సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, జూనియర్ కళాశాలలకు చెందిన 680 మంది బాలికలు పోటీలకు తరలివచ్చారు. క్రీడాకారుల ఫ్లాగ్ మార్చ్ అనంతరం ఎంపీ వాలీబాల్ సర్వీస్ ఇచ్చి ఉత్సాహపరిచారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాలకు సంబంధించి అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హై జంప్, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలలో బాలికలు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. గెలుపోటములు సహజమని, ప్రతి ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని తదుపరి గెలుపు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నిస్, అథ్లెటిక్స్, క్రికెట్ క్రీడలకు సంబంధించి కోచ్‌లను నియమించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ డిప్యూటీ సెక్రటరీ రాజేశ్వరి, ప్రిన్సిపల్ అనిత, జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తివాస గోవిందా..


దర్శనానికి క్యూ లైన్‌లో నిలబడ్డ భక్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ముందుగా అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు మెట్లపై కొబ్బరికాయలు కొట్టి గోవిందనామస్మరణ చేస్తూ స్వామి చెంతకు చేరి ముడుపులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు నైవేద్యం పెట్టి స్వామిని వేడుకున్నారు. అలివేలు మంగమ్మ, స్వామి పాదుకలు, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారు.


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఉద్దాలను దర్శించుకుంటున్న భక్తులు

రేషన్ బియ్యం పట్టివేత

కోస్గి: పట్టణ శివారు మహబూబ్‌నగర్ రోడ్డులోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. షాద్‌నగర్‌కు చెందిన మహేశ్ కోస్గిలో ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యం సేకరించి ఆటోలో కోస్గి గోదాంలో నిల్వ చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ పక్కా సమాచారంతో సోమవారం సాయంత్రం నిఘా ఉంచి బియ్యం సంచులతో వచ్చిన ఆటో పట్టుకున్నారు. ఆటోలో 80 సంచుల బియ్యం ఉండగా.. స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పినట్లు డీటీ వివరించారు. డీఎస్ఓ ఆదేశాల మేరకు రేషన్ బియ్యం నిల్వ చేసిన యజమానిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నారాయణపేటలో 9.53 క్వింటాళ్లు..

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో దామరగిద్ద మండలం సర్వాపూర్‌కు చెందిన శ్రీనివాసులు వద్ద 7.32 క్వింటాళ్లు, యాద్గిర్ మార్గంలో జాజాపూర్‌కి చెందిన చంద్రప్ప వద్ద 2.21 క్వింటాళ్ల రేషన్ బియ్యం సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. డీటీ పంచనామా అనంతరం ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.


కోస్గిలో పట్టుబడిన బియ్యం చూపుతున్న డీటీ ఆనంద్

లొంగిపోయిన కోర్టు సూపరింటెండెంట్

రిమాండ్‌కు ఆదేశించిన న్యాయమూర్తి

గద్వాల క్రైం: గద్వాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ భూ పరిహారం సొమ్ము రూ.3.08 కోట్లు తన భార్య లలిత పేరిట కాజేసిన విషయం పాఠకులకు విధితమే. నిందితుడు సోమవారం ఉదయం గద్వాల కోర్టులో లొంగిపోయినట్లు గద్వాల సీఐ శ్రీను తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకర్లకు వెల్లడించారు. సత్యనారాయణ రూ.3.08 కోట్లు కాజేసిన ఘటనపై కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ నిర్మల గత నెల 21న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. నిందితుల ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్నట్లు సమాచారం అందిందని.. పోలీసులు పట్టుకునేందుకు యత్నించగా తప్పించుకొని కోర్టులో లొంగిపోయారన్నారు. నిందితుడు సత్యనారాయణకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చిందని.. కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పత్రాలు సమర్పించామని చెప్పారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. పరారీలో ఉన్న ఆయన సతీమణిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరణకు గురైంది.

బండ్ల రాజశేఖర్‌రెడ్డి అరెస్ట్


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బండ్ల రాజశేఖర్‌రెడ్డికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

- కర్ణాటకలో చిక్కిన సీడ్ వ్యాపారి
- బాలిక మృతి కేసులో అరెస్టు
- 11 రోజుల పాటు రిమాండ్ విధించిన న్యాయమూర్తి

గద్వాల క్రైం: పోలీసులకు చిక్కడు దొరకడుగా మారిన కేసు వ్యవహారంలో ఎట్టకేలకు పోలీసులు నిందితుడిని కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లాలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. 19 రోజుల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన సీడ్ వ్యాపారి బండ్ల రాజశేఖర్‌రెడ్డిని గద్వాల కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 11 రోజులపాటు రిమాండ్‌కు ఆదేశించారు. కేసుకు సంబంధించిన వివరాలను గద్వాల సీఐ శ్రీను సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక(16)పై గద్వాలకు చెందిన సీడ్ వ్యాపారి బండ్ల రాజశేఖర్ రెడ్డి చోరీ నెపం మోపి కేసు నమోదు చేయించారు. దీంతో భయాందోళనకు గురైన బాలిక అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో (అక్టోబర్ 11న) పురుగు మందు తాగగా.. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 24న మృతిచెందింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డిపై తల్లి ఫిర్యాదు మేరకు అక్టోబర్ 21న పోలీసులు కేసు నమోదు చేశామన్నారు. దీంతో అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లడంతో.. పోలీసులు ఆరు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ పట్టణ శివారులో ఉన్నట్లు గుర్తించి 11 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడికి వైద్య పరీక్షల అనంతరం గద్వాల కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 11 రోజులపాటు రిమాండ్ విధించారన్నారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించామన్నారు.

ఉత్కంఠకు తెర..

బాలిక మృతి ఘటనపై రాష్ట్రస్థాయిలో ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు నిరసనలు తెలిపారు. మరోవైపు బాలిక కుటుంబానికి జరిగిన అన్యాయంపై జువైనల్ కోర్టు, మానవ హక్కుల కమిషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. నిందితుడు ప్రముఖుడు కావడం, రాజకీయ అండదండలు ఉన్నాయనే కారణంతో పోలీసులు అరెస్టుకు ప్రయత్నించడం లేదని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు నిందితుడు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో దాఖలు చేసిన తరుణంలో న్యాయమూర్తి పిటిషన్‌ను రద్దు చేసుకోవాలని సూచించారు. దీంతో అన్ని దారులు మూసుకుపోవడంతో బండ్ల రాజశేఖర్‌రెడ్డి పోలీసులకు లొంగిపోయినట్లు ప్రచారం జరుగుతుంది. అయితే పోలీసులు రాయచూర్‌లో అదుపులోకి తీసుకున్నామని చెబుతున్నారు. అయితే ఇన్నిరోజులు తప్పించుకు తిరుగుతున్న నిందితుడు పోలీసులకు చిక్కడంతో ఉత్కంఠకు తెరపడినట్లయింది.

పనిచేయని ఫాస్టాగ్


పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు

అలంపూర్ : పుల్లూరు టోల్‌ప్లాజాలో సోమవారం గద్వాల ఆర్టీసీ డిపోకు చెందిన ఫాస్టాగ్ పనిచేయలేదు. దీంతో బస్సులన్నీ అక్కడే నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుంచి కర్నూలు, కర్నూలు వైపు నుంచి హైదరాబాద్ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న ఒకే డిపోకు చెందిన బస్సులు నిలిచాయి. బస్సులకు ఉన్న ఫాస్టాగ్ పని చేయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని డ్రైవర్లు తెలిపారు. సుమారు 17వరకు బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఫాస్టాగ్ పని చేయకపోవడంతో చివరకు టోల్ రుసుం చెల్లించి బస్సులు ముందుకు కదలాయి. ఫాస్టాగ్‌లో డబ్బులు జమ చేకపోవడంతోనే బస్సులు నిలిచినట్లు సమాచారం.

నదీమతల్లికి దశవిధ హారతులు


అలంపూర్‌లోని తుంగభద్ర నదికి దశవిధ హారతులు ఇస్తున్న అర్చకులు


నదీహారతికి హాజరైన భక్తులు

భక్తులతో కిక్కిరిసిన అలంపూర్ ఆలయాలు

- పరమేశ్వరుడి అలంకరణలో కార్తీక దీపాలు
- జోగుళాంబ కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు

జోగుళాంబ శక్తిపీఠం: కార్తీక మాసం.. రెండో సోమవారం రోజున అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించడంతో పాటు దీపాలు వెలిగించడం, దీపదానం చేశారు. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి దీపాలు వెలిగించి అక్కడే వన భోజనాలు, ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర భక్తులు భజనలు నిర్వహించారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన

కార్తీక దీపాలు..

నవబ్రహ్మ ఆలయ ప్రాంగణంలో గద్వాలకు చెందిన ప్రముఖ కళాకారుడు పవన్ పరమేశ్వరుడు, నంది విగ్రహాలు వేయగా.. భక్తులు వాటి చుట్టూ కార్తీక దీపాలు వెలిగించారు. దేవాదాయశాఖ ఆదేశాల మేరకు దేవస్థానం తరపున భక్తులకు ఉచితంగా నూనె, వత్తులు, దీప ప్రమిదలు అందజేసినట్లు ఈఓ పురేందర్‌కుమార్ చెప్పారు. అదేవిధంగా నదీ తీరంలో గద్వాల మనూరు ప్రసన్నాచార్ బృందం దశవిధ హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన..

సాయంత్రం వేళ ఆలయ ఆవరణలో జోగుళాంబ కళాక్షేత్రం ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో నృత్యం చేస్తూ పలువురి ప్రశంసలు అందుకున్నారు. ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, పాలక మండలి సభ్యులు కుర్వ గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగశిరోమణి తదితరులు పాల్గొన్నారు.